రంజాన్ వేళలు
ఇఫ్తార్ - బుధవారం
సాయంత్రం - 6.31
సహర్ - గురువారం
ఉదయం - 5.03


శంభీపూర్ రాజు




కాసాని జ్ఞానేశ్వర్

కొలిక్కి వచ్చిన కసరత్తు!

రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు?

ఎట్టకేలకు చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లో తమ అభ్యర్థులను బీఆర్ఎస్ ఖరారు చేసింది. చేవెళ్ల నుంచి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, మల్కాజిగిరి నుంచి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బరిలో దించాలని గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు దీనిపై పార్టీ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే అధికార కాంగ్రెస్, బీజేపీల్లో టికెట్ల కోసం నేతలు ఒక్క పక్క పోటీపడుతుంటే మొన్నటి దాకా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్‌లు సైతం వెనకడుగు వేసే పరిస్థితి వచ్చింది. దీంతో సోమ, మంగళవారాల్లో పార్టీ నేతలు విస్తృతంగా చర్చించి పోటీకి బరిలో నిలచేందుకు జ్ఞానేశ్వర్, రాజుల పేర్లను ఖరారు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల గాలి వీస్తోందని, బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసినా గెలవలేం అనే భయంతోనే చాలా మంది నేతలు కారు గుర్తుపై పోటీకి జంకుతున్నట్లు సమాచారం!

- చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్.. మల్కాజిగిరి నుంచి శంభీపూర్ రాజు!
- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతులెత్తేయడంతో మారిన సమీకరణలు
- మొన్నటి దాకా టికెట్ కోసం పోటీ..
- ప్రస్తుతం అభ్యర్థులే కరువైన దైన్యంలో బీఆర్ఎస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రెండు లోక్‌సభా స్థానాలకు అభ్యర్థులను దాదాపు ఖరారు చేసింది. కీలకమైన ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ఖరారుకు కొన్నాళ్లుగా కసరత్తు చేస్తున్న బీఆర్ఎస్‌కు అభ్యర్థుల ఎంపిక పెద్ద సవాల్‌గా మారిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్‌లో చాలా మంది సీనియర్లే ఉన్నా చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల నుంచి పోటీకి వారిలో ఎక్కువ మంది నేతలు ఆసక్తి చూపడంలేదు. చివరకు పార్టీ అధిష్ఠానం ఈ రెండు స్థానాల అభ్యర్థులపై తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సోమ, మంగళవారాలు వరుసగా రెండు రోజులు జరిగిన సమావేశాల్లో పార్టీ అధినాయకత్వం చేవెళ్ల, మల్కాజిగిరి అభ్యర్థుల ఎంపికపై ఓ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. చేవెళ్ల అభ్యర్థిగా జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, మల్కాజిగిరి అభ్యర్థిగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేర్లు దాదాపు ఖరారయ్యాయి. అయితే వీరిని పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. వాస్తవానికి ఈ రెండు లోక్‌సభా స్థానాల పరిధిలో గల అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీగానే ఓట్లు లభించాయి. అయితే ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా పూర్తిగా మారిపోయాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జడ్పీ చైర్‌పర్సన్లు కాంగ్రెస్ గూటికి చేరారు. అలాగే పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా హస్తం పార్టీలో చేరుతున్నారు. క్షేత్రస్థాయిల్లో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఓటమి భయంతో పార్లమెంట్ స్థానాల నుంచి బరిలో దిగేందుకు సీనియర్ నేతలు సైతం వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల ఎంపిక బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారింది. బీఆర్ఎస్ నుంచి బరిలో దిగేందుకు సీనియర్లు ఆసక్తిచూపకపోవడంతో ఇటీవల ఓడిన కాంగ్రెస్ నేతలకు సైతం బీఆర్ఎస్ ముఖ్యనేతలు ఫోన్‌చేసి మీకు అవకాశం కల్పిస్తామని, కారు పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. అయితే ఎవరూ కూడా ఇందుకు ఆసక్తి చూపలేదు.

అసెంబ్లీ ఫలితాలతో పరిస్థితులు తలకిందులు!

ఇదిలా ఉంటే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వరకూ ఈ రెండు లోక్‌సభ స్థానాల నుంచి కారు గుర్తుపై పోటీచేసేందుకు అనేక మంది నేతలు క్యూకట్టారు. కానీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం పోటీకి నిరాకరించడంతో బీఆర్ఎస్ నాయకత్వం అవాక్కైంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే రంజిత్‌రెడ్డి పోటీకి దూరం కావడం పార్టీ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలను ఆయన శాసించారు. కొన్ని విషయాల్లో అప్పటి మంత్రి సబితారెడ్డి కంటే పార్టీలో ఆయనకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఈ విషయంలో కొందరు పార్టీ ముఖ్యనేతల నుంచి అభ్యంతరాలు సైతం వ్యక్తమయ్యాయి. అయితే ఈ విషయంలో కేటీఆర్ కూడా రంజిత్‌రెడ్డి వైపే ఉండడంతో సబితారెడ్డితో పాటు మరికొందరు నేతలు మౌనంగానే ఉండేవారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలను రంజిత్‌రెడ్డికి అప్పగించారు. తాండూరు, వికారాబాద్, పరిగిల్లో పార్టీ ఓటమి పాలైంది. చేవెళ్లలో మాత్రం స్వల్పతేడాతో బయటపడింది. ఈ నేపథ్యంలో చేవెళ్ల లోక్‌సభ స్థానంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో చివరి క్షణంలో చేవెళ్ల బాధ్యతలను చూసుకోవాలని ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డికి చెప్పారు. ఆయన రంగంలో దిగడంతో అక్కడ పరిస్థితులు కొంత మారాయి. కారణాలేవైనా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత రంజిత్‌రెడ్డి పార్టీకి కొంత దూరం పాటిస్తూ వస్తున్నారు. కొన్ని రోజుల కింద బీఆర్ఎస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిని తానే అని ప్రకటించిన ఆయన ఇపుడు మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా పోటీకి ఆసక్తిచూపడం లేదు. అంతేకాక ఆయన కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నట్లుగానూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకత్వం అభ్యర్థి ఎంపికకు కసరత్తు మొదలుపెట్టింది. అనేక మంది సీనియర్లు ఇపుడున్న రాజకీయ పరిస్థితులు కారణంగా పోటీకి ఆసక్తి చూపలేదు. దీంతో చివరకు ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి పేర్లను పరిశీలించింది. అయితే సబితారెడ్డి కుటుంబం టికెట్ విషయం ముందుగా చెప్పి ఉంటే బరిలో దిగే వారం అని, ఇపుడు తక్కువ సమయం ఉండడంతో పోటీచేయడం కష్టం అని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీంతో కాసాని జ్ఞానేశ్వర్ లేదా ఆయన తనయుడు వీరేష్‌లలో ఒకరిని పోటీ చేయాలని పార్టీ కోరింది. చివరకు మంగళవారం జరిగిన సమావేశంలో కాసాని జ్ఞానేశ్వర్ పేరు ఖరారు చేసినట్లు తెలిసింది. జ్ఞానేశ్వర్ ఎంపికలో సబితారెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం.

మల్కాజిగిరిలో ఉద్యమ నాయకుడికి అవకాశం

ఇక మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలోనూ మాజీ మంత్రి మల్లారెడ్డి తన కుమారుడి కోసం ముందుగానే ఖర్చీఫ్ వేసుకున్నారు. కానీ ఆయన ఇపుడు ఉన్న పరిస్థితుల్లో పోటీ చేయలేనని చేతులెత్తేశారు. మొన్నటి ఎన్నికలదాకా మేడ్చల్ జిల్లాకు అంతా తానే అన్నట్లుగా వ్యవహరించిన మల్లారెడ్డి చివరకు తమ కుటుంబ సభ్యులెవరూ పోటీచేయడం లేదని ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకత్వం షాక్‌కు గురైంది. ఇటీవల మల్లారెడ్డి అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కాలేజీలో అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చివేసిన సంగతి తెలిసిందే. దీని తరువాత మల్లారెడ్డి కాంగ్రెస్‌కు దగ్గరయ్యే యత్నం చేశారు. అంతేకాక వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయడం లేదని ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ మళ్లీ అభ్యర్థి కోసం వేట మొదలుపెట్టింది. చివరకు కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బరిలో దింపాలని నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమ సమయం నుంచీ కేసీఆర్ కుటుంబం వెన్నంటి ఉండడంతో ఈ సారి ఆయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించారు.

నయా వంచన

కాంట్రాక్టర్లకు రూ.8 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన ఏఈ అరెస్టు

- నకిలీ ప్రొసీడింగ్ ఆర్డర్స్‌తో మోసం
- క్రికెట్, కసినోలో బెట్టింగ్ కోసం అడ్డదారి తొక్కిన అధికారి


నిందితుడు రాహుల్

కీసరరూరల్, మార్చి 12: అతడు గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) శాఖలో ఏఈ.. మంచి జీతం.. అయినప్పటికీ.. డబ్బు కోసం అత్యాశకు పోయి ఘరానా మోసానికి తెరతీశాడు. తనకున్న అధికారాన్ని బూచీగా చూపి కాంట్రాకర్లకు ఎర వేశాడు. నకిలీ ప్రొసీడింగ్ ఆర్డర్లతో వారి వద్ద రూ.8 కోట్ల వరకు వసూలు చేశాడు. తప్పించుకు తిరుగుతున్న అతగాడిని పోలీసులు అరెస్టు చేయడంతో.. చివరికి కటకటాలపాలయ్యాడు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితులు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య చెప్పిన వివరాల ప్రకారం.. గడ్డం రాహుల్ బాబు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో కీసర సర్కిల్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే దురాశ పుట్టడంతో క్రికెట్, కసినో తదితర ఆన్‌లైన్ గేమ్‌లను ఆడేందుకు పథకం వేశాడు. ఇందుకు ప్రత్యేకంగా ఒక యాప్‌నూ సృష్టించాడు. ఆన్‌లైన్ గేములు ఆడేందుకు కావాల్సిన పెట్టుబడి కోసం కొంతమంది కాంట్రాక్టర్లను ఎంచుకున్నాడు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అధిక లాభాలు వస్తాయని వారికి ఆశ చూపాడు. పైగా ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీవర్క్ ఆర్డర్లను తయారు చేసి వారిని బురిడీ కొట్టించాడు. ఒకరికొకరికి తెలియకుండా పలువురు కాంట్రాక్టర్ల వద్ద నుంచి దాదాపు రూ.8 కోట్ల మేర వసూలు చేశాడు. గతంలో నాగారం గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేర ఉప్పల్‌లో ఉన్నఎస్‌బీఐ బ్యాంకు ఖాతాను ఉపయోగించుకున్నాడు. దీంతో పాటు తన మిత్రురాలైన సాయిధరణికి చెందిన సికింద్రాబాద్ హిమ్మత్‌నగర్‌లోని ఎస్‌బీఐలోని ఖాతాను కూడా వాడుకున్నాడు. ఇంకా పలు నకిలీ కంపెనీల పేర బ్యాంకు ఖాతాలను తెరిచాడు. కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బులను నేరుగా ఆయా ఖాతాల్లో జమ చేయించేవాడు. ఆ తర్వాత ఆన్‌లైన్లో డబ్బులను డ్రా చేసుకుని ఉపయోగించుకునేవాడు. ఉప్పల్‌లోని బ్యాంకు ఖాతాలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు జమ చేశారని, ఆ డబ్బులను డ్రా చేసి ఇస్తే రూ.లక్ష ఇస్తానని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీవాణికి ఆశ చూపాడు. డబ్బుకోసం కక్కుర్తిపడిన ఆమె చెక్కు ద్వారా డబ్బులు డ్రా చేసి ఏఈ రాహుల్‌కు ఇచ్చింది. ఇలా వసూలు చేసిన డబ్బులను ఆయన తన సొంతానికి వాడుకున్నాడు. నకిలీ ప్రొసీడింగ్ ఆర్డర్స్‌తో ఏఈ తమను మోసం చేశాడని పలువురు కాంట్రాక్టర్లు గుర్తించారు. గోవింద్ దాలియా అనే వ్యక్తితో పాటు మరికొంత మంది కాంట్రాక్టర్లు ఎనిమిది నెలల క్రితమే కీసర పీఎస్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్లలో ఏఈపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టారు. అప్పటికే రాహుల్ విదేశాలకు వెళ్లిపోయాడు. తనవద్ద ఉన్న డబ్బంతా అయిపోవడంతో విదేశాల నుంచి ఇటీవలే హైదరాబాద్ చేరుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం రాత్రి రాహుల్‌ను కీసర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను తన తప్పిదాలను అంగీకరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలుసుకున్న బాధితులు కీసర పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు.


కీసర పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

పాఠశాలలకు మంచి రోజులు

వచ్చే విద్యా సంవత్సరం నాటికి మారనున్న రూపురేఖలు

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- హెచ్‌ఎంలకు తప్పనున్న కష్టాలు



తాండూరు: మార్చి 12: పాఠశాలలు, కళాశాలలకు మంచి రోజులు రానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు రోజుల క్రితం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన పలు అంశాలపై ప్రస్తావించారు. విద్య వ్యవస్థ బలోపేతంలో భాగంగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. ఐదేళ్లుగా పాఠశాలలు, కళాశాలకు సంబంధించి విద్యుత్ కరెంటు బిల్లులు కట్టలేక ప్రధానోపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడ్డారు. చాలా పాఠశాలలో కరెంటు కనెక్షన్లను తొలగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ఈనెల 12 మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. దీంతో కరెంటు ఉచితంగా సరఫరా అయితే విద్యార్థులకు తాగునీటితో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు, పాఠశాల గదులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవడంతో పాటు డిజిటల్ పాఠాలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమిస్తామని కూడా చెప్పారు. దీంతో ప్రధానోపాధ్యాయులకు పరిశుభ్రత , అటెండర్ తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయి. సహాయకుడు ఉంటే ఇబ్బందులు ఉండవని హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు. ప్రతి బడిలోను మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. బడుల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయాలని, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మారనున్నాయి.

జిల్లాలో పాఠశాలల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	778
ప్రాథమికోన్నత పాఠశాలలు	192
ఉన్నత పాఠశాలలు	290
మొత్తం	1,260

నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులకు నోటీసులు


కులకచర్ల ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అబ్దుల్‌ఘని

కులకచర్ల, మార్చి 12: నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం సాధించి సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు మంగళవారం నారాయణపేట ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్‌ఘని నోటీసులు జారీ చేశారు. 2015లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నకిలీ ధ్రువపత్రాలతో కొందరు ఉపాధ్యాయులు ఉద్యోగాలు సాధించారని అప్పట్లో గండీడ్ మండలం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దొడ్డికాడి గోపాల్ గండీడ్ ఎంఈవో వెంకటయ్యకు, రంగారెడ్డి జిల్లా డీఈవోకు ఫిర్యాదు చేశారు. 2016లో విచారణ జరిపిన అప్పటి డీఈవో సత్యనారాయణరెడ్డి అంతారంలో ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న కొండారెడ్డి, చెరువుముందరి తండా(కే) ప్రాథమికపాఠశాలలో పని చేస్తున్న రాంచందర్, దోమ మండలం ఐనాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న ఎల్లారెడ్డిలను విధుల నుంచి తొలగించారు. సంబంధిత ఉపాధ్యాయులు 2017లో హైకోర్టును ఆశ్రయించారు. సస్పెన్షన్ చేయకుండా ఎలా విధుల నుంచి తొలగిస్తారని, ముందుగా సస్పెన్షన్ చేసి పూర్తి స్థాయితో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2022లో ఉన్నతాధికారులు వికారాబాద్ డీఈవోకు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని సూచించారు. డీఈవో రేణుకాదేవి ఆదేశాలతో నారాయణపేట్ ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని కులకచర్ల ఎంఈవో కార్యాలయంలో సంబంధిత ముగ్గురు ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని సూచించారు. తమకు పది రోజుల గడువు ఇవ్వాలని సంబంధిత ఉపాధ్యాయులు రాతపూర్వకంగా డీఈవోకు విజ్ఞప్తి చేశారని, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

రూ. 77 లక్షలే!

భారీగా తగ్గిన కీసరగుట్ట ఆదాయం

కీసర,మార్చి12: కీసరగుట్ట ఆలయ ఆదాయం 77 లక్షల 79 వేల 525 రూపాయలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ, ఈవో నరేందర్ తెలిపారు. కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని మంగళవారం ఆలయ మహామండపంలో లెక్కించారు. దేవాదాయ శాఖ కమిషనర్ శేఖర్ అధ్వర్యంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈవో నరేందర్, భక్తుల సమక్షంలో లెక్కించారు. హుండీద్వారా రూ.27,13,376, ప్రసాదాల విక్రయం, దర్శనాలు, అభిషేకాలు, ఆన్‌లైన్ సేవలు కలిపి రూ.50,66,149, రాగా, మొత్తం 77లక్షల79వేల525 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదాయం మొత్తాని స్వామివారి పేరిట కీసర ఎస్‌బీఐ బ్యాంక్‌లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కాగా కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వచ్చిన ఆదాయం ఈ సారి భారీగా తగ్గింది. గతేడాది కంటే ఈసారి రూ.25 లక్షలకు పైగా ఆదాయం తగ్గింది. భక్తుల రాకతగ్గడం, శీఘ్ర దర్శనం (రూ.400 టికెట్) లైన్ తీసేయడం, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఆదాయం తగ్గినట్లు ఆలయ చైర్మన్, ఈవో చెప్పారు. కాగా బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున రూ.కోటి మంజూరు చేసినప్పటికీ ఆదాయం మాత్రం అంతంత మాత్రంగానే రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం బ్రహ్మోత్సవాలప్పుడే హడావిడి చేసే అధికారులు, నిర్వాహకులు కాస్త ఆలయ అభివృద్ధిపై, ఆదాయంపై, భక్తుల నిత్య సౌకర్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మహా మండపంలో ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 12: రానున్నఎన్నికలను దృష్టిలో పెట్టుకొనిసమర్థవంతమైన, స్పష్టమైన ఎలక్టోరల్‌రోల్‌ను తయారు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మంగళవారం కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకమైన ఎన్నికల జాబితా తయారు చేయాలని, జాబితాలను జాగ్రత్తగా పరిశీలించాలని నోడల్ అధికారులకు సూచించారు.అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్ , ఆర్‌డీవో విజయకుమారి, శ్రీనివాసులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

18న శిక్షణ శిబిరంలోని పాత వస్తువుల వేలం



ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మార్చి 12: ఈనెల 18వ తేదీన వికారాబాద్ జిల్లాలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో పనికిరాని, పాత, చెడిపోయిన, సర్వీస్ అయిపోయిన వస్తువులను పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనాలనుకొనేవారు ఈనెల 18న ఉదయం 10.30 గంటలకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. ఏదైనా సమాచారం కొరకు సంప్రదించడానికి జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి సెల్‌నెంబర్ 8712670012కు గానీ లేదా డీఎస్పీ ఏఆర్ వీరేశం సెల్ నెంబర్ 8712670019కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదా ఆర్‌ఐ అంజాత్ పాషా సెల్‌నెంబర్ 8712670028కు గాని సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

రైతు రుణమాఫీని అమలు చేయాలి

నవాబుపేట, మార్చి 12: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు లక్షల రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని పీఏసీఎస్ డైరెక్టర్ మానెయ్య అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు.

వేలం వాయిదా



వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఈవో

కులకచర్ల, మార్చి 12: బండవెల్కిచర్ల పాంబండ ఆలయంలో నిర్వహించిన కొబ్బరికాయల విక్రయానికి వేలం వాయిదాపడింది. సరైన పాట రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు దేవాలయ ఈవో సుధాకర్ తెలిపారు. ఇట్టి వేలాన్ని ఈనెల 18న మరోసారి నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ నర్సమ్మ రాములు, పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు, కార్య నిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజాన్ సందడి



మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

వికారాబాద్, మార్చి 12: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింల ఉపవాసదీక్షలు మొదలయ్యాయి. సాయంత్రం దీక్ష విరమించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వికారాబాద్ పట్టణంలోని మసీదులను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయగా, హలీమ్ సెంటర్లు రద్దీగా మారాయి.



విద్యుత్ కాంతుల్లో మసీదు



హలీస్ సెంటర్

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

● వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల



వికారాబాద్, మార్చి 12: వేసవి కాలం ప్రారంభమైనందున వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైప్‌లైన్ లీకేజీలు ఎక్కడ ఉన్నా వాటికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని 34వార్డుల్లో ఎక్కడ నీటి సమస్య ఉన్నా, స్థానిక కౌన్సిలర్ లేదా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మూడు రోజులుగా వికారాబాద్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేయనున్నట్లు తెలిపారు.

మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంజీవ్



సంజీవ్

పరిగి, మార్చి 12: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్(మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పరిగి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన బి.సంజీవ్‌కుమార్ నియమితులయ్యారు. మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. అలాగే దోమ మండలం మైలారం గ్రామానికి చెందిన డాక్టర్ బి.జగన్మోహన్‌రెడ్డి మెపా రాష్ట్ర గౌరవఅధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం పని చేస్తామని తెలిపారు. ముదిరాజ్‌ల హక్కుల సాధన, విద్యార్థుల చదువు కోసం సంఘం ఆద్వర్యంలో చేయూతను అందిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, జనాభా ప్రకారం చట్ట సభల్లో స్థానం కోసం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, ఆ దిశంగా ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

దోమ, మార్చి 12: మండలంలోని మోత్కూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో ఉన్న 150మంది విద్యార్థులకు బ్యాగులు, డ్రాయింగ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మల్లేశం మాట్లాడుతూ మారుమూల పాఠశాలకు ఇన్ఫోసిస్ బ్యాగులు అందించడం సంతోషదాయకం అన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ప్రతినిధి సుధామూర్తికి, ప్రతినిధులు ముత్యపు వంశీతో పాటు ఇందుకు కృషి చేసిన గ్రామ యువకులు కరణం శ్రీకాంత్‌రావు, కరణం కృష్ణకాంత్‌లకు గ్రామస్థులు, పాఠశాల యాజమన్యా కమిటీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జైరాం, వైస్ ఎంపీపీ గుర్మిట్‌కాల్ మల్లేశం, కరణం శ్రీకాంత్, సంపల్లి మల్లేశం, సంకటి శశిధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నందయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, మార్చి 12: పన్నులు వందశాతం వసూలు చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పన్నుల వసూళ్లపై అధికారులు, బిల్ కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో అలసత్వం వహించరాదన్నారు. పన్నుల రూపంలో వసూలైన నిధులతోనే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పన్నులు పూర్తి స్థాయిలో వసూలు కాకుంటే అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేందర్‌కుమార్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి



సభకు బయల్దేరుతున్న బీజేపీ నేతలు

మేడ్చల్ టౌన్, మార్చి 12: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం వచ్చేలా ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా నాయకుడు గౌరారం జగన్‌గౌడ్ అన్నారు. ఎల్బీ స్టేడియంలో మంగళవారం కేంద్రం హోం మంత్రి అమిత్‌షాతో నిర్వహించిన బహిరంగ సభకు మేడ్చల్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా జగన్‌గౌడ్ మాట్లాడుతూ.. మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పొన్నం అంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రూ.2.93కోట్ల అభివృద్ధి పనులకు తీర్మానం



మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చర్చిస్తున్న చైర్ పర్సన్, పాలక వర్గ సభ్యులు

ఘట్‌కేసర్, మార్చి 12: మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.2.95కోట్లు వెచ్చించాలని మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మంగళవారం పలు తీర్మానాలు చేశారు. వివిధ వార్డుల్లో రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణానికి ఒక్కో వార్డుకు రూ.10లక్షల చొప్పున రూ.1.80కోట్ల నిధులు కేయించి అభివృద్ధి పనులను చేపట్టాలని మున్సిపాలిటీలో తీర్మాణం చేశారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్ల మరమ్మతులకు రూ.20లక్షలు, రోడ్ల ప్యాచ్‌వర్క్‌లకు రూ.10లక్షలు, డ్రైనేజీల మరమ్మతులకు రూ.10లక్షలు, మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీలు స్తంభించినప్పుడు మరమ్మతులు చేయడానికి జెట్ మిషన్ కొనుగోలుకు రూ.50లక్షలు, బకెట్ మిషన్ అద్దెకు రూ.5లక్షలు, కార్యాలయం ఖర్చులు, అత్యవసర పనులకు రూ.18లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీని మోడల్ సిటీగా మార్చాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో పార్కుస్థలం కబ్జా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ మల్లేష్ కొద్దిసేపు కింద కూర్చోని నిరసన తెలిపాడు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్లుల మాదవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గురుకుల్ కళాశాల అభివృద్ధికి రూ.1.50కోట్లు మంజూరు

ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.50కోట్లను మంజూరు చేసింది. ఏళ్లుగా గురుకుల్ కళాశాలకు, పాఠశాలకు నిధులు లేక విద్యాలయం శిథిలావస్థకు చేరుకున్నది. తరగతి గదులు, ఉపాధ్యాయులు లేక కళాశాలలో ఇటు పాఠశాలలో విద్యార్థులు చేరడం లేదు. దీంతో గురుకుల్‌ను కాపాడాలని స్థానిక నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు రూ.1.50కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో కళాశాల భవనాల అదనపు గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేపడం పట్ల ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్‌లు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3వ వార్డుల్లో తాగు నీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.15లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్తులు జారీ చేసింది. ప్రజల తాగునీటి సమస్యలను అధిగమించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం పట్ల 3వవార్డు కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రోన్ పథకం కింద మహిళా రైతు ఎంపిక



డ్రోన్‌తో డబీల్‌పూర్ రైతు సహకార సంఘం చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, జక్కుల మాధవి

మేడ్చల్ టౌన్, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నమో డ్రోన్...దీదీ డ్రోన్' పథకం కింద మండలంలోని కొనాయిపల్లికి చెందిన స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు, మహిళా రైతు మాధవి ఎంపికయ్యారు. ఈపథకం కింద దాదాపు రూ.16లక్షల విలువ చేసే డ్రోన్‌ను మాధవి దక్కించుకున్నారు. వ్యవసాయ రంగంలో వాడుతున్న ఆధునిక పరికరాల్లో భాగంగా డ్రోన్‌తో పంట పొలాలపై క్రిమి సంహారక ముందుల పిచకారి చేయటంతో పాటు యూరియా, మందులు చల్లే పని చేపడుతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళ రైతులకు డ్రోన్‌లు అందజేయడానికి పథకాన్ని ప్రవేశపెట్టారు. కాగా ఈ పథకం కింది ఉచితంగా డ్రోన్ పొందడానికి మేడ్చల్ మండల కోనాయిపల్లికి చెందిన స్వయం సహాయక గ్రూపు సభ్యురాలు జక్కుల మాధవి దరఖాస్తు చేసుకోగా ఆమెను ఎంపిక చేసి 15రోజుల పాటు డ్రోన్ నిర్వాహణ పట్ల సమగ్రంగా శిక్షణ ఇచ్చి, రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో డ్రోన్ అందజేశారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

బషీరాబాద్, మార్చి 12: ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడూ దృష్టి పెట్టాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్, ఆశ వర్కర్లతో ప్రత్యేక సమావేశమయ్యారు. గ్రామంలో ఏఏ సమస్యలున్నాయనే దానిపై శాఖల వారీగా సమీక్షిస్తూ ఆరా తీశారు. వేసవి దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. గ్రామంలో ఇటీవల రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు.గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

ఈటల కోడలి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోడలు శమిత

మేడ్చల్‌టౌన్, మార్చి 12: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ తరపునఆయన కోడలు శమిత మంగళవారం ప్రచారం నిర్వహించారు. మేడ్చల్‌లోని 21, 22వ వార్డుల్లో ప్రచారం చేశారు. స్థానిక బీజేపీ నేతలు లవంగ శ్రీకాంత్, మైసరి రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీ చేయనున్న తనమామ ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు.

గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

తాండూరు రూరల్, మార్చి 12: మండలంలోని అంతారం గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని గ్రామ ప్రత్యేకాధికారి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. అంతారంలో రూ.15లక్షలతో సీసీరోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతోనే గ్రామం అభివృద్ధి సాధ్యమన్నారు. సమస్యలు ఏమున్నా వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. గ్రామంలో రూ.5లక్షలతో పంచాయతీ కార్యాలయం నుంచి పెంద్యా నర్సింహులు ఇంటి వరకు, బోనమ్మ దేవాలయం నుంచి కోస్గి మొగులప్ప ఇంటి వరకు, దస్తగిరిపేట్‌లో రూ.5లక్షలతో వెంకట్‌రెడ్డి ఇంటి నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, ఎంపీటీసీ శాంతు, మాజీ సర్పంచ్ వడ్డె శేఖర్, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్, పీఏసీఎస్ డైరెక్టర్ పెంద్యా నర్సింహులు, నాయకులు కోస్గి ఆశన్న, జంగని మొగులప్ప, డప్పు రాజు, దావిద్, విజయ్‌కుమార్, నర్సింహులు, రజనీకాంత్, వడ్డె అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్ నూతన సీఐకి సన్మానం



సీఐ శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మూడుచింతలపల్లి, మార్చి 12: శామీర్‌పేట్ మండలానికి ఇటీవలే బదిలీపై వచ్చిన నూతన సీఐ శ్రీనాథ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘతన్ అధ్యక్షుడు తూం వేణుగోపాల్ ఆద్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనాథ్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు బస్వారెడ్డి, కోశాధికారి వీరేశం, మండల యూత్ అధ్యక్షుడు కటికెల వైద్యనాథ్ పాల్గొన్నారు.

వరిసాగులో జింకులోపం నివారణ చర్యలు చేపట్టాలి



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

దోమ, మార్చి 12: యాసంగి వరి సాగులో జింకు లోపం నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. దోమలో రైతు రాజేందర్‌రెడ్డి సాగుచేసిన వరి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి వరిలో జింకు ధాతులోపం ఎక్కువగా ఉండటంతో చిలేటెడ్ జింక్, ఫార్ములా-6 మందును పిచికారి చేయాలని సూచించారు. ప్రతీ రైతు మోతాదు మేరకే పంటకు మందులు పిచికారి చేయాలన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడటంతో రైతులకు నష్టమే కాని లాభం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కావ్య, కొల్లూర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూరురూరల్, మార్చి 12 : ఓవర్ లోడ్ తో వస్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఓవర్‌లోడ్ వాహనాలు, సిమెంటు ట్యాంకర్లను పోలీసులు ఆపి తనిఖీ చేయగా, వాటిలో పరిమితికి మించి లోడ్ ఉన్నట్లు గుర్తించారు. అట్టి ఓవర్ లోడ్ వాహనాలను ఆర్టీవోకు అప్పగించి, కేసు నమోదు చేసి, ఫైన్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్ రూరల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. మైసమ్మగూడలోని నరసింహారెడ్డి ఇంజనీరింగు కళాశాలలో జరిగిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన అవుషాపూర్ వీబీఐటీ కళాశాల క్రీడాకారులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, శివలాల్, మహేష్, వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్/కులకచర్ల:** విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. దౌల్తాబాద్ మండలంలోని మాటూర్ ప్రాథమికోన్నత, గోకఫస్లాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, భీంరెడ్డి, సాయిలుగౌడ్, వీరన్న, శానమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా కులకచర్ల మండలంలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం దేవ్లనాయక్ బహుమతులు అందజేశారు.

● **కీసర రూరల్:** నగరంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా స్వయం సేవా సంఘాల ఆత్మీయ సమ్మేళనానికి కీసర నుంచి మహిళలు బస్సులో బయల్దేరారు. ఈ బస్సును మంగళవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

● **కులకచర్ల:** జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు అవుతుందని, గ్రామాల్లో రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్‌లు, గోడ రాతలు రాయరాదని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కులకచర్లలో ఓ పార్టీ నాయకుడు గోడపై రాసిన రాతలను మంగళవారం పంచాయతీ సిబ్బందితో తొలగించారు. కోడ్ అమలులో ఉండటంతో ఫ్లెక్సీలు, బ్యానర్‌లు, గోడ రాతలు, పోస్టర్‌లు అతికించినా సంబంధిత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

● **కొడంగల్ రూరల్:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉంటారని, సాయంత్రం 5 గంటల తర్వాత వాహనాల తనిఖీ చేపట్టరాదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే.గుల్షన్ తెలిపారు. వాహనాల తనిఖీ కారణంగా సాయంత్రం వేళలో మసీద్‌లకు వెళ్లే ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం నూతనంగా కొడంగల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సన్మానించారు.

● **కొడంగల్:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిదిరి మురళీ, బోదిష్, ఆనంద్‌రావు, గోపినాథ్, నీలిమా, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** భీమ్ దీక్ష-జనం కోసం దీక్ష చేపడుతున్నామని స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి లక్నపూర్ శ్రీనివాస్ అన్నారు. భీమ్‌దీక్ష-జన కోసం దీక్షకు సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 15న కాన్షీరాం జయంతి నుంచి భీమ్‌దీక్ష కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

● **కొడంగల్:** ఈ నెల 28న జరిగే మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో మొత్తం 55 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

● **శామీర్‌పేట:** శామీర్‌పేటలోని నల్సార్ క్యాంపస్‌లో గల నూతన ప్రైమరి హెల్త్‌సెంటర్‌లో బుధవారం(నేడు) పీవీ నర్సింహారావు స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నల్సార్ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యులత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **పూడూరు:** శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పూడూరు మండలంలోని కంకల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తుర్కఎన్కెపల్లి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి పొందారు.

● **తాండూరురూరల్:** ఐసీఎల్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో పుష్పగిరి రెటీనా ఇన్‌స్టిట్యూషన్ వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, డ్రాప్స్ అందజేశారు. మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

యాలాల, మార్చి 12: కుటుంబ కలహాలతో ఓ మహిళ పాడుబడ్డ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాస్నం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం రాస్నాం గ్రామానికి చెందిన కానాపురం యాదమ్మ (43) ఆమె భర్త నర్సిములు కలిసి వ్యవసాయం చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో యాదమ్మ వారి వ్యవసాయ పొలం సమీపంలో గల పాడుబడ్డ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల ఎస్ఐ శంకర్ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక భార్య..

ధారూరు, మార్చి 12: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని గట్టేపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. గట్టేపల్లి గ్రామానికి చెందిన బేగరి శివకుమార్‌కు యాలాల మండలం, పగిడియాల్ గ్రామానికి చెందిన బేగరి తుల్జమ్మ(32)తో 2015లో వివాహమైంది. మద్యానికి బానిసైన శివకుమార్ రోజూ భార్య తుల్జమ్మను తిడుతూ వేధించేవాడు. భర్త ప్రవర్తనతో మానసిక క్షోభకు గురైన తుల్జమ్మ ఈనెల 10వ తేదీన చీమల మందు తాగి అస్వస్థతకు గురైంది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఆమెను ఉస్మానియా అనుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందిందని ఎస్ఐ చెప్పారు. మృతురాలి అక్క బేగరి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొడంగల్‌లో దొంగల హల్‌చల్

కొడంగల్, మార్చి 12: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. కొడంగల్ పట్టణంలోని లాహోటీ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు అర్ధరాత్రి రూ.3లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి దోచుకెళ్లారు. మరో ఇంటి ముందున్న రూ.లక్ష విలువ గల కోడె దూడలను అపహరించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనాస్థలాలకు చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

ఓటీపీ చెప్పి.. రూ.లక్షా 24వేలు పోగొట్టుకున్న రిటైర్డ్ ఉద్యోగి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12: ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంక్ ఓటీపీ చెప్పి రూ.1,24,000లు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాడు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్, సింగాపూర్‌టౌన్‌షిప్‌లో ఉండే కాజా వెంకటేశ్వరరావుకు ఈ నెల 1న తన ఫోన్‌కు సీపీ-బీఎఎల్ఎస్‌బీఏ నుంచి మీ ఎస్‌బీఐ బ్యాంక్ పాస్‌వర్డ్ నేటితో గడువు ముగియనున్నదని బాలాజీ ఎంటర్‌ప్రైజ్‌ను సంప్రదించాలని సందేశం వచ్చింది. దీంతో వెంకటేశ్వరరావు నిజమని నమ్మి బాలాజీ ఎంటర్‌ప్రైజ్‌ను ఫోన్‌లో సంప్రదించి, వారు చెప్పినట్లు ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాడు. అతను ఓటీపీ చెప్పడంతో బ్యాంక్ ఖాతాలోని రూ.లక్షా 24వేలు కట్ అయ్యాయి. కొద్ది సేపటికి బ్యాంక్ నుంచి తన డబ్బులు కట్ అయినట్లు సందేశం రావడంతో బ్యాంకుకు వెళ్లి విచారించాడు. డబ్బులు పోగొట్టుకున్నట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మేడ్చల్ టౌన్, మార్చి 12: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నివాసి భూషణ్‌పాటిల్ కొద్ది రోజులుగా మేడ్చల్‌లోని అత్వెల్లిలో తన భార్య రమాబాయ్(30 సంవత్సరాలు), పిల్లలు దానేశ్వర్(4 సంవత్సరాలు), వీర్(2 సంవత్సరాలు)లతో కలసి నివాసముంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న భార్య, ఇద్దరు పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని, బంధువుల వద్ద ఆరాతీశాడు. ఆచూకీ తెలియకపోవడంతో చుట్టుపక్కల వారిని, బంధువులను ఆరాతీశాడు. మంగళవారం స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. భర్త భూషణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారును వెంబడించి వ్యక్తిపై దాడి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12: కారులో వెళ్తున్న ఓవ్యక్తిని ఐదుగురు వ్యక్తులు వెంబడించి దాడికి పాల్పడ్డారు. ఆ కారును ధ్వంసం చేశారు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ గ్రామానికి చెందిన కుర్ర నవీన్‌కుమార్ టీసీఎస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కారును జోడిమెట్ల సమీపంలో రిపేర్ చేయించేందుకు మెకానిక్‌కు ఇచ్చారు. సోమవారం రాత్రి తిరిగి కారును తెచ్చుకోవడానికి వెళ్లాడు. టెస్టు డ్రైవ్ చేస్తున్న క్రమంలో వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, నవీన్, రమేష్, సత్తి, వంశీలు రోడ్డుకు అడ్డంగా రెండు బైక్‌లను నిలిపారు. దీంతో నవీన్ కుమార్ ఆ బైక్‌లను పక్కకు జరపాలని వారితో గొడవకు దిగాడు. వారు వినిపించుకోకపోవడంతో కారును వెనక్కి మళ్లించి వెళ్తుండగా రెండు బైక్‌లపై ఆఐదుగురు నవీన్‌కుమార్‌ను వెంబడించారు. నారపల్లి సమీపంలోని భాగ్యనగర నందనవనం వద్ద కారు అపి నవీన్‌కుమార్‌పై దాడి చేశారు. రాళ్లతో కారును ధ్వంసం చేసి పరారయ్యారు. అనంతరం బాధితుడు పోచారం ఐటీసీ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దాడిచేసిన ఐదుగురిని గుర్తించి అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి.. ఇద్దరిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.సైదులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ బస్ డిపోకు చెందిన ఈసీఐఎల్-ఘట్‌కేసర్ ఆర్టీసీ బస్సు ఘట్‌కేసర్‌కు వస్తుండగా శివారెడ్డిగూడ సమీపంలో వెనుక నుంచి మారుతి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అవుషాపూర్‌కు చెందిన నీలకంఠ శివ, నారపల్లికి చెందిన వాజీద్‌లు బస్సును నిలిపి నిర్లక్ష్యంగా బస్సు నడుపుతున్నావ్ అంటూ దుర్భాషలాడుతూ బస్సు డ్రైవర్‌పై దాడికి దిగారు. అంతటితో ఆగకుండా బస్సు డ్రైవర్ క్యాబిన్‌లోకి ఎక్కి డ్రైవర్ డ్రైవర్ రాజ్యానాయక్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో బస్సు డ్రైవర్, కండక్టర్ ప్రకాష్‌లు ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శివ, వాజీద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గడువు ముగిసిన ఆహార పదార్థాలతో ఐస్‌క్రీంల తయారీ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12: గడువు ముగిసిన ఆహార పదార్థాలతో కుల్ఫీలు, బాదంపాలు, ఐస్‌క్రీంలు తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిపై ఎస్‌వోటీ పోలీసుల దాడిచేసి పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ, వెంకటాద్రిటౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఘనశ్యామ్ జాట్(28) గడువు ముగిసిన ఆహార పదార్థాలతో ఐస్‌క్రీం, పళ్ళరసాలు, బాదంపాలు తయారు చేసి విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఘనశ్యామ్ జాట్ ఇంటిపై దాడి చేసి ఐస్‌క్రీంలు, బాదంపాలు, పళ్ళ రసాలకు వాడిన గడువు ముగిసిన ఫౌడర్ డబ్బా, కలర్ బాక్స్‌ఫ్రూటీ ప్యాకెట్లను, జెల్లి బాక్స్, బటర్ స్కాచ్ నట్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఘనశ్యామ్ జాట్‌ను అరెస్టు చేశారు.

కాన్పులో శిశువు మృతి.. బంధువుల ఆందోళన

మేడ్చల్‌టౌన్ మార్చి 12: మేడ్చల్‌లోని ప్రజ్ఞ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు కాన్పులోనే మృతిచెందినట్లు ఆరోపిస్తూ కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. మేడ్చల్‌కు చెందిన ఓగర్భిణి స్థానిక ప్రజ్ఞ అనుపత్రిలో కాన్పుకోసం సోమవారం చేర్పించారు. ఆసుపత్రి వారు సాధారణ కాన్పు కోసం మంగళవారం వరకు వేచిచూసి కాన్పుచేయగా మృతశిశువు ప్రసవించింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతిచెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.